సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

● ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్

కవాడిగూడ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె. లక్ష్మణ్ అన్నారు. మంగళవారం కవాడిగూడ డివిజన్ దోమలగూడ జ్యోతినగర్‌లో 42వ పోలింగ్ బూత్ ఇన్‌చార్జి, మాజీ కార్పొరేటర్ టి. రవీందర్ ఆధ్వర్యంలో బూత్ అభియాన్ సంపర్క్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించారు. సంపర్క్ కార్యక్రమాన్ని బీజేపీ శ్రేణులు విజయవంతం చేయాలని లక్ష్మణ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా దోమలగూడ హనుమాన్ దేవాలయం మాజీ సభ్యుడు లక్ష్మణ్‌తోపాటు పలువురు లక్ష్మణ్ సమక్షంలో బీజేపీలో చేరారు. కార్పొరేటర్ రచనశ్రీ, నాయకులు జి. వెంకటేష్, రంగరాజ్‌గౌడ్, ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు సలంద్రి శ్రీనివాస్ యాదవ్, డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు ఎంసీ మహేందర్‌బాబు, ఎ. ప్రభాకర్, జ్యోతినగర్ బస్తీ ప్రధాన కార్యదర్శి రవిచారి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ ఎన్. గౌతమ్‌రావు

పార్టీ కోసం అంకితభావంతో పనిచేయాలి

బర్కత్‌పుర, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ పది ఎంపీ స్థానాలు కైవసం చేసుకుంటుందని సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్. గౌతమ్‌రావు అన్నారు. సికింద్రాబాద్‌లో మరోసారి కమలం జెండా ఎగురుతుందని ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం బర్కత్‌పురలో నగర కార్యాలయంలో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. నాయకులు, కార్యకర్తలు అంకిత భావంతో పనిచేయాలని సూచించారు. బర్కత్‌పుర చమాన్ వద్ద సికింద్రాబాద్ ఎంపీ ఎన్నికల కార్యాలయాన్ని బుధవారం సాయంత్రం ఐదు గంటలకు ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్ ప్రారంభిస్తారని చెప్పారు. 17న పోలింగ్ బూత్ అధ్యక్ష కార్యదర్శుల సమావేశం ఇంపీరియల్ గార్డెన్‌లో జరుగుతుందని తెలిపారు. మాజీ మంత్రి సి. కృష్ణాయాదవ్, కార్పొరేటర్లు కన్నె ఉమాదేవి, వై అమృత, నాయకులు చంద్రశేఖర్, రాజశేఖర్‌రెడ్డి, సందీప్‌సాయి, సారంగపాణి, ఓబీసీ మోర్చా నగర ప్రధానకార్యదర్శి కేశబోయిన శ్రీధర్, సమన్వయ కర్త శ్రీధర్ పాల్గొన్నారు.

సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో..

కారుణ్య నియామకాలు చేపట్టాలి : సీపీఎం

రాంనగర్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డులో కారుణ్య నియామకాలు చేపట్టాలని సీపీఎం నగర కార్యదర్శి ఎం. శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డికి రాసిన బహిరంగ లేఖ విడుదల చేశారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కంటోన్మెంట్ బోర్డులో వివిధ హోదాల్లో పనిచేస్తున్న 102 మంది ఉద్యోగులు చనిపోయారని, వీరిలో 80 శాతం మంది బలహీన వర్గాల కుటుంబాలకు చెందిన వారేనని గుర్తు చేశారు. చనిపోయిన కుటుంబాలకు చెందిన వారిని కారుణ్య నియామకం కింద ప్రతియేటా 5 శాతం మందిని నియమించాలని ఆదేశాలు ఉన్నప్పటికీ.. పదేళ్లలో ఒక్కరిని కూడా నియమించకుండా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. కారుణ్య నియామకాలను వెంటనే చేపట్టాలని 2022లో రక్షణ శాఖ అధికారులకు వినతిపత్రం అందజేసినా నేటికీ చర్యలు చేపట్టలేదన్నారు. మరణించిన ఉద్యోగుల కుటుంబ సభ్యులు కంటోన్మెంట్ బోర్డు అధికారుల చుట్టూ తిరుగుతున్నారన్నారు. లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే కారుణ్య నియామకాలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.

రాంనగర్ టీఆర్‌టీ కాలనీలో

కాంచీపురం ఆమోనిక సిల్క్ షోరూం ప్రారంభం

రాంనగర్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): వస్త్ర వ్యాపారంలో పేరొందిన కాంచీపురం ఆమోనిక సిల్క్ రెండో బ్రాంచిని రాంనగర్ టీఆర్‌టీ కాలనీ శ్రీనివాస వీధిలో సంస్థ నిర్వాహకులు సీహెచ్.శ్రీకాంత్, సీహెచ్. నరేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ తొలి షోరూం సరూర్‌నగర్‌లో ఉందన్నారు. రాంనగర్ పరిసర ప్రాంతాల ప్రజలకు సేవలను అందించాలనే సంకల్పంతో ఇక్కడ రెండో బ్రాంచి ప్రారంభించామని తెలిపారు. షోరూంలో కంచిపట్టు, ఫ్యాన్సీ, పట్టు పవడాలు చీరలు లభిస్తాయని పేర్కొన్నారు. రూ. 290 నుంచి మొదలు లక్ష రూపాయల విలువగల చీరలు షోరూమ్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు.



షోరూమ్‌ను ప్రారంభిస్తున్న నిర్వాహకులు సీహెచ్ శ్రీకాంత్, నరేష్

గురుకుల విద్యార్థుల ఆత్మహత్యలపై

విచారణ జరపాలి : ఆర్.కృష్ణయ్య

రాంనగర్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): గురుకుల విద్యార్థుల ఆత్మహత్యలపై విచారణ జరపాలని రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాశామని తెలిపారు. మంగళవారం విద్యానగర్‌లో బీసీ భవన్‌లో ముఖ్యమంత్రికి రాసిన లేఖలోని వివరాలను విలేకరులకు తెలియజేశారు. ఇటీవల 65 మంది బాల, బాలికలు ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. గురుకుల పాఠశాలలో వెయ్యి నుంచి రెండు వేల మంది విద్యార్థులు కిక్కిరిసిపోయారని, దీంతో చదువు, ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. పాములు కరిచి కొందరు, ఆరోగ్యం దెబ్బతిని మరికొందరు చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. భువనగిరిలో అమ్మాయిని కొందరు చంపి దానిని కప్పిపుచ్చడానికి తల్లిదండ్రులు, బీసీ సంఘం నాయకులపై పోలీసులు తప్పుడు కేసులు పెట్టారని ఆరోపించారు. కీసర, యాచారం, భూపాలపల్లి, కాగజ్‌నగర్, ఆసిఫాబాద్, బాటసింగారం, షాద్‌నగర్, యాదాద్రి భువనగిరి తదితర ప్రాంతాలలోని బీసీ గురుకుల పాఠశాలల్లో కనీస సౌకర్యాలు లేకపోవడంతోపాటు తాగునీటి సౌకర్యం కూడా లేదని, ఫుడ్‌పాయిజన్‌తో విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నారని వాపోయారు. ఈ విషయంపై ప్రభుత్వం స్పందించి సత్వరం చర్యలు చేపట్టాలని కృష్ణయ్య డిమాండ్ చేశారు.

ఆస్పత్రుల్లో రోగులకు ఉచితంగా భోజనం సరఫరా

బర్కత్‌పుర, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రైవేట్, ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న రోగులు, వారి అటెండర్లకు ఉచితంగా భోజనం సరఫరా చేస్తున్నట్లు గ్లోబల్ బ్రాహ్మణ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు గిరి ప్రసాద్ శర్మ తెలిపారు. మంగళవారం బర్కత్‌పురలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న రోగులు, వారి అటెండర్లు ప్రతిరోజూ ఉదయం 7 గంటల లోపు వివరాలతో మేసేజ్ పెడితే ఉదయం 11.45 గంటలకు భోజనం అందజేస్తామన్నారు. భోజనం కావాల్సిన వారు 9701609689 ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయాలని సూచించారు.

శ్రీశైలంలో కాటేజీల నిర్మాణానికి రూ. 21 లక్షల విరాళం

గోల్నాక, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ధార్మిక విధానాన్ని కొనసాగించడం భారతీయ సంస్కృతిలో భాగమని బీజేపీ ఓబీసీ మోర్చా నేషనల్ సోషల్ మీడియా మెంబర్ పెరిక సురేష్ అన్నారు. శ్రీశైలం దేవస్థానంలో పెరిక సంఘం నిర్మిస్తున్న 57 కాటేజ్‌ల నిర్మాణానికి రూ. 21 లక్షల విరాళం సంఘం ప్రతినిధులకు మగళవారం ఆయన అందజేశారు.



పెరిక సంఘం సభ్యుల నుంచి విరాళం రసీదు అందుకుంటున్న సురేష్

పేదల సంక్షేమమే మోదీ ప్రభుత్వ లక్ష్యం

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

కవాడిగూడ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే మోదీ ప్రభుత్వ లక్ష్యమని కేంద్రం మంత్రి జి. కిషన్‌రెడ్డి అన్నారు. మంగళవారం కవాడిగూడ డివిజన్ ముగ్గుబస్తీలో ఎంపీ నిధులతో ఏర్పాటు చేసిన పవర్ బోరింగ్, నీటి ట్యాంక్‌ను ఎంపీ కె. లక్ష్మణ్‌తో కలిసి ప్రారంభించారు. కార్పొరేటర్ రచనశ్రీ, మాజీ కార్పొరేటర్ టి. రవీందర్, ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు సలంద్రి శ్రీనివాస్‌యాదవ్, ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్ ఎం రమేష్‌రాం, బండారు విజయలక్ష్మి, డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు ఎంసీ మహేందర్‌బాబు, ఎ.ప్రభాకర్ పాల్గొన్నారు.

పాఠశాలలు, ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

రాంనగర్: ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం విద్యానగర్ ఎస్‌వీఈఎస్ ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలో ఎంపీ నిధులు రూ. 6 లక్షల వ్యయంతో వేసిన పవర్ బోరింగ్, అభినందన అప్నాఘర్ సంస్థ ఆధ్వర్యంలో రూ. 4 లక్షల వ్యయంతో మధ్యాహ్న భోజనం కోసం ఏర్పాటు చేసిన షెడ్‌ను ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్‌తో కలిసి ప్రారంభించారు. 33 ప్రాథమిక వైద్య కేంద్రాల్లో రోగుల కోసం షెడ్‌లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మధ్యాహ్న భోజనం కోసం షెడ్ నిర్మించిన అభినందన అప్నాఘర్ సంస్థ నిర్వాహకులను అభినందించారు. బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్ రమేష్‌రాం, అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షుడు ఆర్.నరేష్, పాఠశాల ప్రిన్సిపాల్ రమేష్, అప్నాఘర్ ఫౌండేషన్ సభ్యులు డాక్టర్ ఇ.భవానీ తదితరులు పాల్గొన్నారు.

బాగ్‌లింగంపల్లి లంబాడీ తండాలో ఎంపీ నిధులు రూ. 12 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన రెండు పవర్ బోరింగ్‌లను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఎంపీ డాక్టర్ లక్ష్మణ్ మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రవిచారి తదితరులు పాల్గొన్నారు.



కవాడిగూడ ముగ్గుబస్తీలో పవర్ బోర్, నీటి ట్యాంక్‌ను ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, కార్పొరేటర్ రచనశ్రీ

దేశవ్యాప్త కార్మికుల సమ్మెను విజయవంతం చేయాలి

ముషీరాబాద్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): కార్మిక చట్టాలను, రైతుల హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈ నెల 16న చేపట్టిన దేశవ్యాప్త కార్మికుల సమ్మె, భారత్‌బంద్‌ను విజయవంతం చేయాలని హింద్ మజ్దూర్‌సభ (హెచ్‌ఎంఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెబ్బ రామారావు కోరారు. మంగళవారం ముషీరాబాద్‌లో సంఘం కార్యాలయం వద్ద సమ్మె విజయవంతం చేయాలని హెచ్‌ఎంఎస్ ఆధ్వర్యంలో రూపొందించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. రెబ్బరామారావు మాట్లాడుతూ.. కార్మికులకు అన్యాయం చేసే నిర్ణయాలు తీసుకుంటున్న బీజేపీ ప్రభుత్వానికి కార్మికులు, రైతులు గుణపాఠం చెబుతారన్నారు. హెచ్‌ఎంఎస్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎండీ అమ్జద్, సీనియర్ నాయకులు శ్రీనివాస్, భిక్షపతి, నవీన్‌కాంత్, నర్సింగ్ రావు, మూర్తి, లక్ష్మణ్ పాల్గొన్నారు.



దేశవ్యాప్త కార్మికుల సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న హెచ్‌ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెబ్బ రామారావు తదితరులు

వామపక్ష విద్యార్థి సంఘాల మద్దతు

రాంనగర్: దేశవ్యాప్త కార్మిక సమ్మెకు వామపక్ష విద్యార్థి సంఘాలు మద్దతు ప్రకటించాయి. మంగళవారం విద్యానగర్ మార్క్స్ భవన్‌లో జరిగిన సమావేశంలో పీడీఎస్‌యూ, ఏఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ, ఏఐడీఎస్‌ఓ, ఏఐఎస్‌బీ సంఘాల నేతలు పి.మహేష్, పుట్ట లక్ష్మణ్, టి.నాగరాజు, ఎన్.ఆజాద్, విజయ్, మల్లేష్, హకీమ్ నవీద్ మాట్లాడారు. నూతన జాతీయ విద్యావిధానం లోపాలపుట్ట అని ఎద్దేవా చేశారు. జాతీయ విద్యావిధానం వల్ల దాదాపు 90 శాతం విద్యార్థులు నాణ్యమైన విద్య పొందే హక్కు కోల్పోతున్నారని వారన్నారు.

కార్మికులందరూ పాల్గొనాలి

గోల్నాక: దేశవ్యాప్తంగా కార్మిక సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ అంబర్‌పేట జోన్ కన్వీనర్ జి. రాములు పిలుపునిచ్చారు. కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ రూపొందించిన పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానం రద్దు చేయాలని, ధరలను నియంత్రించాలని, కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకులు ఎం. మహేందర్, బి. సుబ్బారావు, మునిసిపల్ కార్మికులు పాల్గొన్నారు.

చిన్నారులకు విటమిన్ - ఏ సిరప్ వేయించాలి





చిన్నారులకు విటమిన్-ఏ సిరప్ వేస్తున్న వైద్యాధికారి దీప్తి ప్రియాంక, కార్పొరేటర్ ఉమాదేవి

ముషీరాబాద్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): చిన్నారుల సంపూర్ణ ఆరోగ్యానికి తప్పనిసరిగా విటమిన్-ఏ సిరప్ వేయించాలని ముషీరాబాద్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం(యూపీహెచ్‌సీ) వైద్యాధికారి డాక్టర్ దీప్తి ప్రియాంక సూచించారు. మంగళవారం ముషీరాబాద్ యూపీహెచ్‌సీలో చిన్నారులకు విటమిన్-ఏ సిరప్ వేసే కార్యక్రమాన్ని అంబర్‌పేట క్లస్టర్ హేమలతతో కలిసి ఆమె ప్రారంభించారు. ముషీరాబాద్, భోలక్‌పూర్ యూపీహెచ్‌సీ పరిధుల్లో గల 3709 మంది చిన్నారులకు ఈ నెల 17వ తేదీ వరకు విటమిన్-ఏ సిరప్ వేయనున్నట్లు తెలిపారు. పీహెచ్‌ఎన్ భాగ్యలక్ష్మి, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పోషకాహారం అందించాలి

బర్కత్‌పుర, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): చిన్నారులకు పోషకాహారం అందించాలని కార్పొరేటర్ కన్నె ఉమాదేవి సూచించారు. మంగళవారం చప్పల్ బజార్ ఇందిరానగర్ బస్తీలో ఐదేళ్లలోపు పిల్లలకు విటమిన్-ఏ సిరప్ వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అన్ని ఆరోగ్య కేంద్రాల్లో విటమిన్-ఏ సిరప్ అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, డాక్టర్ మనోజ్ రెడ్డి, డాక్టర్ పద్మజ తదితరులు పాల్గొన్నారు.

మహిళను ఢీకొట్టిన చెత్త వాహనం

రాంనగర్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): చెత్త తరలించే వాహనం ఢీకొని ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. నాగమయ్యకుంట బస్తీకి చెందిన స్వరూప (60) మంగళవారం పింఛన్ కోసం వెళ్తోంది. చెత్త వాహనం డ్రైవర్ అజాగ్రత్తగా నడుపుతూ ఆమెను ఢీకొట్టడంతో తలకు గాయమవడంతోపాటు చేయి విరిగింది. ఆమెను వెంటనే స్థానికంగా గల ఆస్పత్రికి తరలించారు. బస్తీవాసులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చెత్త డంపింగ్ యార్డు తొలగించాలి

జెడ్‌బీ గార్డెన్ సమీపంలో జీహెచ్‌ఎంసీ ఏర్పాటు చేసిన చెత్త డంపింగ్ యార్డ్ ప్రమాదాలకు నిలయంగా మారిందని. డంపింగ్ యార్డును తొలగించాలని డిమాండ్ చేస్తూ నాగమయ్యకుంట బస్తీ అధ్యక్షుడు కె. సాయిలు నాయకత్వంలో స్థానికులు ధర్నా చేసి నిరసన తెలిపారు. సాయిలు మాట్లాడుతూ.. డంపింగ్ యార్డు తొలగించే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు.



గాయపడిన మహిళ, నినాదాలు చేస్తున్న నాగమయ్యకుంట వాసులు

కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరితో ప్రజలకు నష్టం

● ఎమ్మెల్యే ముఠాగోపాల్

● నల్లగొండ సభకు తరలివెళ్లిన బీఆర్‌ఎస్ నేతలు

ముషీరాబాద్/చిక్కడపల్లి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): నదీ జలాల్లో తెలంగాణ వాటాపై కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి వల్ల ప్రజలు తీవ్రంగా నష్టపోతారని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. మంగళవారం నల్లగొండలో బీఆర్‌ఎస్ నిర్వహించిన బహిరంగ సభకు భోలక్‌పూర్ గంటసాల క్రీడామైదానం నుంచి డివిజన్ అధ్యక్షుడు వై. శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు బస్సుల్లో తరలివెళ్తున్న ర్యాలీని ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇతర రాష్ట్రాలకు తెలంగాణ నుంచి ఒక్క నీటిచుక్క ఇచ్చినా సహించేది లేదన్నారు. తెలంగాణకు అన్యాయం చేసే నిర్ణయాలను తీసుకుంటే పోరాటం చేస్తామన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు ముఠా జైసింహ, శంకర్‌గౌడ్, రహీం, ముచ్చకుర్తి ప్రభాకర్, సుధాకర్ గుప్తా, వల్లాల శ్యామ్‌యాదవ్, శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

భోలక్‌పూర్ డివిజన్ రంగానగర్, ముషీరాబాద్ డివిజన్ పార్శిగుట్ట, గాంధీనగర్ డివిజన్ నుంచి నాయకులు కొండా శ్రీధర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆకుల అరుణ్‌కుమార్ తదితరులు నల్లగొండ సభకు తరలివెళ్లారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

తెలుగు భాషా పరిరక్షణకు చిట్టెన్‌రాజు విశేష కృషి

చిక్కడపల్లి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): తెలుగుభాషా పరిరక్షణకు చిట్టెన్‌రాజు విశేషకృషి చేస్తున్నారని వేంకటేశ్వర యూనివర్సిటీ మాజీ వీసీ ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. ప్రపంచవ్యాప్తంగా తొమ్మిది దేశాలలో ప్రపంచ తెలుగు మహాసభలు స్వయంగా నిర్వహించడం ప్రభుత్వాలు కూడా చేయలేని పని అని, అమెరికాలో ఉండి భాషా సంస్కృతిపట్ల అభిమానం చాటుకుంటున్నారన్నారు. వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా త్రిదశాబ్ది వేడుకల సందర్భంగా మంగళవారం రాత్రి త్యాగరాయగాన సభలో నాలుగు గ్రంథాల ఆవిష్కరణ సభ జరిగింది. ఆచార్య ఇనాక్ మాట్లాడుతూ.. రచయిత లేకుంటే ఏ కళాప్రక్రియ లేదన్నారు. నటుడు తనికెళ్ల భరణి శ్రీదేవి మురళీధర్ రచించిన స్వయంసిద్ధ నవలను ఆవిష్కరించి మాట్లాడారు. నటి రేఖ జీవితచరిత్ర స్వయంసిద్ధ అని, అది అత్యుత్తమ జీవితచరిత్ర అన్నారు. వంగూరి చిట్టెన్‌రాజు రచించిన అమెరికా కాకరకాయ కథలు సినీ గీత రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు, దయాస్ఫోరా తెలుగు కథల సంకలనంను సాహితీవేత్త డా.ఓలేటి పార్వతీశం, అర్ధ శతాబ్దిలో అమెరికా తెలుగుకథలు సంపుటిని అవధాని కడిమెళ్ల వరప్రసాద్ ఆవిష్కరించారు. రాధిక మంగిపూడి, వంశీరామరాజు తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న అతిథులు

గృహజ్యోతి వివరాల అప్‌డేట్ నిరంతర ప్రక్రియ

● తెల్లరేషన్ కార్డు ఉన్న వారివి సేకరణ

● స్పాట్ బిల్లింగ్ మెషీన్లలో నమోదు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): గృహజ్యోతి వివరాల అప్‌డేట్ నిరంతర ప్రక్రియ అని విద్యుత్‌శాఖ అధికారులు తెలిపారు. 'ఆంధ్రజ్యోతి'లో మంగళవారం వచ్చిన 'వస్తారా.. వెళ్లాలా..?' గృహజ్యోతి వివరాల సేకరణపై అస్పష్టత అనే కథనానికి వివిధ ప్రాంతాల్లో దరఖాస్తుదారుల వివరాలు సేకరిస్తున్న విద్యుత్ అధికారులు స్పందించారు. ప్రజాపాలనలో గృహజ్యోతికి దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు స్పాట్ బిల్లింగ్ మెషీన్ల (ఎస్‌పీఎం)లో నమోదు చేయడంతోపాటు తెల్లరేషన్‌కార్డు ఉండి ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోలేని వారి వివరాలు కూడా నమోదు చేసుకుంటున్నట్లు తెలిపారు. సిబ్బంది ఇళ్లకు వెళ్లినప్పుడు కొంతమంది ఉండడం లేదని, అలాంటి వారి కోసం సమీపంలో ప్రత్యేక కౌంటర్లు, హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేసి ట్యాబ్‌లు, ఫోన్లలో గృహజ్యోతి వివరాలు అప్‌డేట్ చేస్తున్నారని చెప్పారు. సర్వర్ సమస్య తలెత్తిన ప్రాంతాల్లో విద్యుత్‌సిబ్బంది కనెక్షన్‌దారుడి నుంచి తెల్లరేషన్‌కార్డు, ఆధార్ నంబర్, ప్రజాపాలన దరఖాస్తు నంబర్, ఫోన్ నంబర్లు నమోదు చేసుకొని ఆ వివరాలను తర్వాత ఎస్‌పీఎంలో అప్‌డేట్ చేస్తున్నామని పేర్కొన్నారు. అద్దె ఇళ్లల్లో ఉంటున్న వారికి తెల్లరేషన్ కార్డు ఉంటే మీటర్ ఎవరిపేరు మీద ఉన్నా వారి వివరాలు కూడా స్పాట్ బిల్లింగ్ మెషీన్లలో నమోదు చేస్తున్నామని అధికారులు తెలిపారు.



శ్రీవారి శాంతి కల్యాణంలో భక్తులు

కనులపండువగా శ్రీవారి శాంతి కల్యాణం

చిక్కడపల్లి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లో లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహోత్సవాల సందర్భంగా మంగళవారం కనులపండువగా శ్రీవారి శాంతి కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా సుప్రభాతం, విష్ణుసహస్రనామ స్తోత్ర పారాయణం, నిత్యహోమం, అన్న సమారాధన తదితర కార్యక్రమాలు నిర్వహించారు.



పురస్కారగ్రహీతలతో నిర్వాహకులు, అతిథులు

ఆచార వ్యవహారాలు..

ఉమ్మడి కుటుంబ సంక్షేమానికి మూలాధారాలు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మన ఆచారవ్యవహారాలు ఉమ్మడి కుటుంబ సంక్షేమానికి మూలాధారాలని వైఎస్ఆర్ మూర్తి చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ వైఎస్ఆర్ మూర్తి అన్నారు. హృదయస్పందన కార్యక్రమాన్ని చిక్కడపల్లిలో నిహ్యాపీ ఫ్రెండ్ సర్కిల్ ఆఫ్ ఇండియా సంస్థ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. నర్తకి కిరణ్మయి మాట్లాడుతూ.. మన సంస్కృతి, కళలు, జీవనప్రగతిపై ఎంతో ప్రభావం చూపుతాయన్నారు. ఈ సందర్భంగా సాహితీభీష్మ డా.పోతుకూచి సాంబశివరావు సాహితీపురస్కారాలను సాహితీవేత్తలకు అందజేశారు. దేవి, ప్రకాశరావు, సౌజన్య, రమాగౌడ్ పాల్గొన్నారు. పలువురు హృదయస్పందన అనే అంశంపై కవితలు వినిపించారు.

'ప్రేమకన్నా కెరీర్‌కే ప్రాధాన్యం ఇవ్వాలి'

చిక్కడపల్లి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): టీనేజర్లకు ప్రేమ ఒక మాయలా కనిపిస్తోందని ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షురాలు డా.హిప్నో పద్మాకమలాకర్ అన్నారు. మంగళవారం అశోక్‌నగర్‌లో హిప్నోకమలాకర్స్ మైండ్ అండ్ పర్సనాలిటీ కేర్‌లో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రేమ మాయలోపడి చాలామంది తనువు చాలిస్తున్నారని వాపోయారు. యువతులు ప్రేమ కన్నా కెరీర్‌కే ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ప్రేమ ఎదుటివారు బాగుండాలని కోరుకునే విధంగా ఉండాలన్నారు. సైకాలజిస్టులు డా. పద్మజ, డా.స్వరూపరాణి మాట్లాడారు.

సామాన్యులకు అందుబాటులో ఉండే

సమాచార పరికరం రేడియో

రాంనగర్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): రేడియో సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండే సమాచార పరికరం అని దూరదర్శన్ కేంద్రం డైరెక్టర్ ఉదయశంకర్ అన్నారు. మంగళవారం ప్రపంచ రేడియో దినోత్సవం రామంతాపూర్ దూరదర్శన్ కేంద్రంలో బాగ్‌లింగంపల్లికి చెందిన డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ కళాశాల జర్నలిజం విభాగం ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులకు రేడియో ప్రాముఖ్యత గురించి వివరించారు.

విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడికి అవార్డు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మాస్టర్స్ క్రీడల్లో సత్తా చాటుతున్న విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు డేవిడ్ ఫ్రాన్సిస్ ఇండియా పవర్ ఐకాన్ అవార్డు అందుకున్నారు. తెలంగాణ సారస్వత పరిషత్‌లో ఆర్‌కే కళా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డా.రంజిత్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో నిర్వాహకులు డేవిడ్ ఫ్రాన్సిస్‌కు అవార్డు బహూకరించారు. గతంలో డేవిడ్ జాతీయ మాస్టర్స్ క్రీడల్లో షాట్‌పుట్, లాంగ్ జంప్ విభాగాల్లో బంగారు పతకాలు సాధించారు.



అవార్డు అందుకుంటున్న డేవిడ్ ఫ్రాన్సిస్



సరోజినీనాయుడు పురస్కారగ్రహీతలతో జస్టిస్ రాధారాణి తదితరులు

స్వాతంత్ర్య సమరయోధుల జీవితాలను

యువత స్ఫూర్తిగా తీసుకోవాలి

చిక్కడపల్లి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుల జీవితాలను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి సూచించారు. మంగళవారం రాత్రి త్యాగరాయగానసభ కళాలలిత కళావేదికలో సరోజినీనాయుడు జయంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రచయిత్రులు పులిగడ్డ విజయలక్ష్మి, శైలజామిత్ర, ఏఎస్ రావు కుమార్తె, సంఘసేవకురాలు డా.సుగుణకు సరోజినీనాయుడు పురస్కారాలు బహూకరించారు. జస్టిస్ రాధారాణి మాట్లాడుతూ.. అవకాశాలు వస్తే మహిళలు అన్ని రంగాల్లో ప్రతిభాపాటవాలు ప్రదర్శిస్తారన్నారు. పాలకుర్తి మధుసూదనరావు, ప్రొఫెసర్ గౌరీశంకర్, నిర్వాహకులు భారతి కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ ప్రధాన కార్యదర్శిగా

మహేష్‌యాదవ్ నియామకం

బర్కత్‌పుర, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ ప్రధాన కార్యదర్శిగా అంబర్‌పేట నియోజకవర్గానికి చెందిన మణి మహేష్‌యాదవ్ నియమితులయ్యారు. ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సి. రోహిణ్‌రెడ్డి ఆయనకు మంగళవారం నియామకపత్రం అందజేశారు. మహేష్ యాదవ్ మాట్లాడుతూ.. పార్టీ పటిష్టతకు కృషి చేస్తానన్నారు.